## 57. ఎవరికెవరు?

వింధ్య పర్వతాల్లోని ఓ లోయలో ఓ చిన్న గ్రామం ఉంది. ఆ గ్రామంలో ఓ గృహస్థు తన భార్య, తల్లుల మధ్య నిత్యం జరిగే పోట్లాటలకి బాధితుడు అవుతున్నాడు. సాధారణంగా చాలామంది ఇళ్ళల్లో అత్తా కోడళ్ళ మధ్య వచ్చేలాంటి పోట్లాటలే అవి. ఆ రాత్రి అత్తా, కోడళ్ళ మధ్య మరో వివాదం మొదలై అది చిలికి చిలికి గాలివానైంది.

"మీ కొడుకుతో నా వివాహం అవగానే ఆయన నా వారు అయ్యారు. ఇక ఆయన తల్లి మాట ఎందుకు వినాలి?" భార్య అత్తని నిలదీసింది.

"తొమ్మిది నెలలు మోసి, కని, పెంచిన నాకు వాడు నేను మరణించే దాకా చెందుతాడు. నువ్వు మధ్యలో వచ్చిన దానివి." తల్లి గట్టిగా కోడలితో చెప్పింది.

గృహస్థు వాళ్ళకి సర్ది చెప్పలేక సతమతమయ్యాడు. అకస్మాత్తుగా వాళ్ళ ఇంటి తలుపు కొట్టిన శబ్దం వినిపించింది. గృహస్థు వెళ్ళి తలుపు తెరిస్తే, ఎదురుగా ఓ సాధువు కనిపించాడు. గృహస్థు అతనికి నమస్కరించి అడిగాడు.

"మీరెవరు? ఏం కావాలి స్వామి?"

"నేను హిమాలయాలకి వెళుతూ ఈ రాత్రికి మీ ఇంటి బయట అరుగు మీద విశ్రమించాను. మీ ఇంట్లోని పోట్లాట విని, మీ భార్యకి, తల్లికి ఓ సంగతి చెప్పాలనిపించి తలుపు తట్టాను." జవాబు చెప్పాడు ఆ సాధువు.

వాళ్ళిద్దర్నీ పిలిచాడా గృహస్థు. వచ్చాక వాళ్ళ వంక చూస్తూ అడిగాడు సాధువు.

"ఈ గృహస్థు శరీరాన్ని చూస్తూ ఒకరు మీ భర్తగా మీకు చెందినవాడు అనుకుంటే, మరొకరు తన కొడుకుగా తనకి చెందినవాడు అనుకుంటున్నారు. నిజానికి అతని శరీరం పుట్టించిన తండ్రిదా? కని పెంచిన తల్లిదా? తల్లితండ్రులని కన్న తాతలదా? అతను పోషించే పిల్లలదా? లేక దానిచేత పనిచేయించే, శరీర పోషణకి జీతం ఇచ్చే వాడిదా?"

ఆ ప్రశ్నకి అత్తా కోడళ్ళిద్దరికి ఏం సమాధానం చెప్పాలో అర్థం కాక ఒకరి వైపు ఇంకొకరు చూసుకున్నారు.

"మీరే జవాబు చెప్పండి." అడిగింది భార్య.

"వాళ్ళల్లో ఎవరికీ ఈ శరీరం చెందదు." సాధువు జవాబు చెప్పాడు,

"వాళ్ళెవరికీ చెందకపోతే అది మరెవరికి చెందుతుంది?" ప్రశ్నించింది తల్లి.

"ఇతనిదే కాదు. మీది, నాది, ఈ ప్రపంచంలోని ప్రతీవారి శరీరం చివరికి రుద్రభూమిలోని చితి మీది అగ్నికి చెందుతుంది. లేదా కుక్కలకో, పురుగులకో చెందుతుంది. ఈ సత్యం తెలుసుకుని మసలుకుంటే పోట్లాటలే ఉండవు."

సాధువు చెప్పదలచుకున్న విషయాన్ని అర్థం చేసుకోలేని తన భార్య, తల్లులకి వివరించాడా గృహస్థు.

"శ్వాస ఆడేంతవరకే సుమా మీరనుకుంటున్నట్లుగా ఈ శరీరం భర్త, కొడుకు, తండ్రి, ఉద్యోగి లేదా ఇంకేదైనా అయేది. ఆ తర్వాత ఇది ఎవరికీ చెందదు. ఊపిరి ఉన్నంత మాత్రం చేత ఈ శరీరధారి ఇతరులకి చెందిన వాడైపోడు. ఈ సత్యం గ్రహించి, దీనికి ఊపిరి ఆడుతున్నంత కాలం మీరు శాంతిగా జీవించి నన్ను శాంతిగా జీవించనీయండి. మనమంతా అద్దె కొంపల్లో ఎవరికి వారు అద్దెకుండేవాళ్ళుగా మసలుకోండి."

"అవును. మనమంతా ఇవాళ ఇంటిలో, రేపు మంటలో అన్న నిజాన్ని ఎన్నడూ విస్మరించకండి" సాధువు బోధించాడు.

## 58. నమ్మకం ముఖ్యం

ఓ సారి ఇబ్రహీం అనే సద్గురువు తన శిష్యుడికి ఆత్మ జ్ఞానం పొందే విద్యని బోధించి, దాన్ని సాధన చేసుకోమని, అంతకు మించి అతను నేర్చుకోవాల్సింది ఇంకేం లేదని చెప్పి వెళ్ళిపోయాడు. ఓ రోజు దారిలో ఆ శిష్యుడికి ఓ రాయి కనిపించింది. దాని మీద చెక్కి వున్న అక్షరాలని చదివాడు.